**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


**ప్రచురణార్థం/ ప్రసారార్థం:** **విజయవాడ,**

**తేది : 08 ఆగష్టు, 2018.**

తెలుగుదేశం ప్రభుత్వం జ్ఞానభేరి పేరిట ప్రభుత్వ నిధులతో తమ పార్టీ రాజకీయ ప్రచారం చేయడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది.

ఇటీవల ఎస్‌వి. యూనివర్శిటీలో ప్రారంభించిన జ్ఞానభేరి కార్యక్రమం ద్వారా ఈ రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా తయారు చేస్తున్నామని, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విఐటి, ఎస్‌ఆర్‌యం వంటి యూనివర్శిటీలు తీసుకొచ్చామని, సంపూర్ణ అక్షరాస్యత సాధిస్తామని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో అగ్రస్థానం సాధించామని చెప్పుకొచ్చారు. యూనివర్శిటీల్లో జరిగే జ్ఞానభేరి ఒక్కోదానికి రూ. 1కోటి చెల్లించారు. ఇది ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేయడమే. బాబు వస్తే జాబు వస్తుందని ప్రచారం చేశారు. నాలుగు సంవత్సరాల నుండి వివిధ శాఖల్లో 2.12 లక్షల పోస్టులు ఖాళీగా వున్నా భర్తీ చేయలేదు. ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా కొత్తగా నాలెడ్జ్ హబ్ చేస్తామనడాన్ని ప్రజలు విశ్వసించడంలేదు. ప్రభుత్వం ప్రచారానికి ఖర్చు చేస్తున్న కోట్ల రూపాయలను యూనివర్శిటీల్లో అధ్యాపకులను నియమిస్తే ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. నన్నయ, కృష్ణా యూనివర్శిటీలలో భవనాల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతూ వ్యవసాయ సంబంధిత విద్యను విస్మరిస్తోంది. వ్యవసాయ విద్యా ప్రమాణాలు దిగజారిపోతున్నాయి. ఇటీవల భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసిఎఆర్) ప్రకటించిన ర్యాంకుల్లో ఏ.పి. వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ యూనివర్శిటీలు వెనుకబడిపోయాయి. పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవు. 2017-18 సం॥ నాటికి 1,05,845 పిల్లలు బడికి దూరంగా ఉన్నారని సర్వశిక్షా అభియాన్ లెక్కలే చెబుతున్నాయి. వాస్తవాలు ఇలా వుండగా తెలుగుదేశం ప్రభుత్వం జ్ఞానభేరి పేరిట సాగిస్తున్న రాజకీయ స్వప్రయోజన కార్యక్రమాన్ని విద్యార్థులు, మేధావులు నిరసిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో రాజకీయ ప్రచారానికి స్వస్తి చెప్పాలి. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి